సాక్షి కర్నూలు

శనివారం, 7, అక్టోబర్, 2023



జయహో భారత్

ఆసియా క్రీడల్లో భారత హాకీ పురుషుల జట్టు స్వర్ణపతకం సాధించడంతో క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో బాణాసంచా కాల్చారు.

8లో▸



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన బి.దేవి రూ.1,00,501 విరాళాన్ని పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.



నల్లమల అడవిలో పేకాట

నల్లమల అడవిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపి 13 మందిని అరెస్ట్ చేశారు. భారీ మొత్తంలో రూ. 6.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

8లో▸

ఆనందాల వారధి

- రూ.6.62 కోట్లతో పూర్తయిన దూదేకొండ - కొత్తపల్లి బ్రిడ్జి
- మాట నిలబెట్టుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- హర్షం వ్యక్తం చేస్తున్న కొత్తపల్లి, సమీప గ్రామాల ప్రజలు
- రూ.24 కోట్లతో చురుగ్గా గోరంట్ల హంద్రీ బ్రిడ్జి పనులు
- రూ.8.10 కోట్లతో మరో రెండు బ్రిడ్జీల నిర్మాణానికి అంచనాలు

మాట ఇవ్వడం.. మరచిపోవడం.. ప్రజలు గుర్తు చేసినా పట్టించుకోకపోవడం.. ఎన్నికల సమయంలో మళ్లీ అదే మాట ఇవ్వడం.. ఓట్లు అభ్యర్థించడం.. కొందరు ప్రజాప్రతినిధులకు పరిపాటిగా మారింది. అయితే ఇందుకు భిన్నంగా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇచ్చిన మాటమీద నిలబడ్డారు. పత్తికొండ నియోజకవర్గంలో కొన్ని గ్రామాల 'దారి'ద్ర్యాన్ని తొలగించారు. ఆయా ప్రాంతాల ప్రజల మధ్య అనుబంధాలకు 'వారధి' వేశారు. దూదేకొండ - కొత్తపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దూదేకొండ- కొత్తపల్లి గ్రామాల మధ్యన వాగుపై నిర్మించిన బ్రిడ్జి

కర్నూలు(అర్బన్): వర్షాకాలం వచ్చిందంటే వారిలో వణుకు ప్రారంభమయ్యేది. ఊరి సమీపంలోని వాగు పొంగితే సమీప గ్రామాలకు రాకపోకలు ఆగిపోయేవి. పంట పొలాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఆరోగ్యం బాగాలేకపోయి, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలన్నా నరకాన్ని అనుభవించాల్సి వచ్చేది.. ఈ దుస్థితిని ఆ గ్రామ ప్రజలు ఎందరికో వివరించారు. చూద్దాం.. చేద్దాం అన్నారు తప్పితే చిత్తశుద్ధితో ఎవరూ ప్రయత్నం చేయలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పత్తికొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కంగాటి శ్రీదేవి.. గ్రామ ప్రజల కష్టాన్ని విన్నారు. తాను గెలిచిన వెంటనే బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని దూదేకొండ - కొత్తపల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. త్వరలోనే ఈ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

రూ. 6.62 కోట్ల ఖర్చు

పత్తికొండ మండలం దూదేకొండ - కొత్తపల్లి గ్రామాల మధ్యన పెద్దవాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.62 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ నిధులు మంజూరయ్యాయి. దీంతో ఈ రెండు గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్డును పూర్తిగా తవ్వేసి, రోడ్డు మధ్యలో ఉన్న వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జికి రెండు వైపులా 4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును వేశారు. బ్రిడ్జి నిర్మాణానికి నాలుగు శ్లాబ్‌లను పూర్తి చేసి రోడ్డుకు అవసరమైన ప్రాంతాల్లో 10 కల్వర్టులను (మోరీలు) నిర్మించారు. ఈ బ్రిడ్జీ, రోడ్డు నిర్మాణం పూర్తి అయిన నేపథ్యంలో దూదేకొండ నుంచి కొత్తపల్లి మీదుగా పులికొండ తదితర గ్రామాలకు వెళ్లేందుకు మార్గం సులభమైంది.

పెరగనున్న రవాణా సౌకర్యాలు

రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు జాతీయ, జిల్లా రహదారులను అభివృద్ధి చేస్తూనే, మరో వైపు పల్లె రోడ్లకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) నిధులతో జిల్లాలోని పలు రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు కింద జిల్లాలో రూ.30 కోట్ల వ్యయంతో పత్తికొండ నియోజకవర్గంలోని దూదేకొండ - కొత్తపల్లి, కోడుమూరు నియోజకవర్గంలోని గోరంట్ల హంద్రీ నదిపై బ్రిడ్జీల నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే ఒక బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తయ్యాయి. మరో రోడ్డు, బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు బ్రిడ్జీలు పూర్తి అయితే పది గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడడంతో పాటు జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు 15 కిలోమీటర్ల దూరం కూడా తగ్గనుంది. ఈ రెండు ప్రాంతాల్లో బ్రిడ్జీలను నిర్మించాలనే ప్రజల కోరికను టీడీపీ నేతలు పట్టించుకోలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ బ్రిడ్జీలకు మోక్షం లభించింది.

మరో రెండు వంతెనలకు రూ.8.10 కోట్లతో అంచనాలు

పత్తికొండ నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు వంతెనల నిర్మాణాలకు సంబంధించి పంచాయతీ రాజ్ ఇంజినీర్లు రూ.8.10 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఈఏడాది జూన్ 1వ తేదిన పత్తికొండకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ రెండు వంతెనల అంశాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తీసుకువెళ్లారు. అందుకు ముఖ్యమంత్రి వెంటనే సమ్మతించిన నేపథ్యంలో పీఆర్ ఇంజినీర్లు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రూ.70 లక్షలతో కంభాలపాడు - కోయిలకొండ మార్గంలో లోలెవెల్ వంతెన, కృష్ణగిరి మండలం గోకులపాడులో రూ.7.40 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మాణాలకు త్వరలోనే మంజూరు ఉత్తర్వులు వెలువడనున్నాయి.

హంద్రీ నదిపై వేగంగా బ్రిడ్జి పనులు

కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న హంద్రీ నదిపై రూ.24.12 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు పియర్స్ పనులు పూర్తి అయ్యాయి. పియర్ క్యాప్స్, హెడ్ హాలేమ్స్ పూర్తి చేసిన అనంతరం శ్లాబ్ వేయనున్నారు. నిర్ణీత సమయంలోగా ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే ... హంద్రీ నదికి ఇటు పక్క ఉన్న కృష్ణగిరి మండలంలోని బీ ఎర్రబాడు, మన్నేకుంట, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కొత్తపల్లి, రామక్రిష్ణాపురం, మల్లాపురం తదితర గ్రామాల ప్రజలకు ఉన్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. పైగా ఈ మండలంలోని కంభాలపాడు, ఎరుకులచెర్వు తదితర గ్రామాల నుంచి జిల్లా కేంద్రమైన కర్నూలుకు వచ్చేందుకు 15 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది. 330 మీటర్ల పొడవుతో బ్రిడ్జి, 5.9 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో ప్రారంభమైన ఈ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.



హంద్రీ నదిపై సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు



కొత్తపల్లి గ్రామం

కష్టాలు తీరాయి



మా గ్రామానికి రోడ్డు లేక పోవడంతో అనేక ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో మోకాలి లోతు బురదలో నడచుకుంటు వెళ్లే వాళ్లం. పొలాలకు వెళ్లాలన్నా, పంట ఉత్పత్తులను దూదేకొండ మెయిన్ రోడ్డు వరకు తీసుకుపోయేందుకు అష్టకష్టాలు పడే వాళ్లం. ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఇప్పుడు వంకపై బ్రిడ్జి, రోడ్డు వేయడం వల్ల మా కష్టాలన్నీ తీరి పోయాయి. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నాం.

– ఎంకే చిన్న నాగేష్, కొత్తపల్లి గ్రామం

గోరంట్ల బ్రిడ్జి గడువులోగా పూర్తి చేస్తాం



పత్తికొండ మండలంలో దూదేకొండ-కొత్తపల్లి గ్రామాల మధ్యన పూర్తి చేసిన విధంగానే కోడుమూరు మండలం గోరంట్ల హంద్రీ నదిపై చేపట్టిన బ్రిడ్జి పనులను కూడా నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తాం. ఇప్పటికే ఈ బ్రిడ్జి పనులు 25 శాతం పూర్తయ్యాయి. పియర్ క్యాప్స్, పియర్ హెడ్ హాలేమ్స్ పూర్తి అయిన వెంటనే స్లాబ్ వేసేందుకు చర్యలు చేపడతాం. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. కొత్తపల్లి బ్రిడ్జిని త్వరలోనే పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నారు.

– ఎస్‌సీఈ మద్దన్న, పీఆర్ ఈఈ, కర్నూలు

న్యూస్‌రీల్

ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి



నర్సరీలో మొక్క నాటుతున్న కలెక్టర్ సృజన

ఆలూరు రూరల్: ఉద్యాన పంటలను మరింత ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఆలూరులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలో శుక్రవారం కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆలూరు, బనవాసి, కాల్వబుగ్గ నర్సరీలలో సీతాఫలం, నేరేడు, దానిమ్మ, మునగ, ఉసిరి, మామిడి, జామతో పాటు ఇతర మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. మొక్కలను సంరక్షించుకుంటే మంచి ఫలాలు వస్తాయన్నారు. జిల్లాలోని మూడు నర్సరీలలో 2.50 లక్షల మొక్కల అందుబాటులో ఉంచగా 2.30 లక్షల మొక్కలు రైతులకు, ప్రజలకు పంపిణీ చేసినట్లు డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా పి.వెంకటలక్షుమ్మ



కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల ఆర్థిక సేవా సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పి.వెంకటలక్షుమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ రెగ్యులర్ ఈడీగా విధులు నిర్వహించిన ఎ.నాగేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో ఈ నెల 4 నుంచి 23వ తేది వరకు సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న వెంకటలక్షుమ్మకు ఇన్‌చార్జి ఈడీగా బాధ్యతలు అప్పగిస్తు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ-క్రాప్‌లో పంటల నమోదు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల ఈ-క్రాప్ నమోదు 100 శాతం పూర్తయింది. ఈ వివరాలను రైతులు ఈ-కేవైసీతో ధ్రువీకరించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఖరీఫ్ సాధారణ సాగు 10,42,537 ఎకరాలు ఉండగా 9,95,521 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయగా ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. వీఏఏ, వీఆర్‌ఓ బయోమెట్రిక్ అథెంటికేషన్ 99.58 శాతం పూర్తయింది. 2,58,390 మంది రైతులు 7,70,526 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-కేవైసీ ద్వారా ధ్రువీకరించారు. ఈ ప్రక్రియ 77.91 శాతం పూర్తయింది. ఈ నెల 10లోపు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసే విధంగా వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మరో వైపు వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగం సూపర్‌చెక్ చేస్తోంది.

16 విద్యుత్ సీఎండీ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఎస్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఈ నెల 16న కర్నూలుకు రానున్నారు. కర్నూలు, డోన్ డివిజన్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొంటారు.

నవంబర్ 30 వరకు ఎల్లెల్సీకి నీరు



తుంగభద్ర దిగువకాలువ

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు నవంబర్ 30 వరకు నీటి విడదల చేయనున్నారు. గురువారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎల్లెల్సీతో పాటు ఇతర కాలువలకు రబీలో వరి సాగుకు నీరివ్వలేమని స్పష్టం చేశారు. రైతులు రబీలో ఆరుతడి పంటల సాగు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా తుంగభద్ర జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 4,437, ఔట్‌ఫ్లో 9,572 క్యూసెక్కులుంది. ప్రస్తుతం ఉన్న 52 టీఎంసీల నీరు డిసెంబర్ నాటికి 20 టీఎంసీలకు చేరుకునే అవకాశం ఉంది. వర్షాలు కురవకపోతే మార్చి నాటికి డ్యాం డెడ్ స్టోరేజ్‌కు చేరే పరిస్థితులు కనబడుతున్నాయి.

దేవరగట్టులో 19 నుంచి ఉత్సవాలు



బన్ని ఉత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం, ఆలయ కమిటీ సభ్యులు

- సంప్రదాయంగా నిర్వహించుకోవాలి
- మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో శ్రీ మాళమల్లేశ్వరస్వామి ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 24వతేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. ఆలూరులోని మంత్రి నివాసంలో శుక్రవారం దేవరగట్టు ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. వర్గ విభేదాలు వీడి ప్రజలంతా ఐక్యంగా బన్ని ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. వేడుకలకు తరలి వచ్చే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నారాయణ స్వామి, మంత్రి తనయుడు ఈశ్వర్, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11,250 క్వింటాళ్ల శనగ విత్తనం పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో శనగ విత్తనాల పంపిణీ ఊపందుకుంది. డి-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్‌లు, నాన్ సబ్సిడీ చెల్లించిన రైతులకు విత్తనాల పంపిణీ జోరందుకుంది. ఇప్పటికే 11,250 క్వింటాళ్ల విత్తన పంపిణీ పూర్తయింది. ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాకు 67,094 క్వింటాళ్ల విత్తనం కేటాయించగా, 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. కొన్నేళ్లుగా ఎకరాకు 25 కిలోల మాత్రమే సబ్సిడీపై పంపిణీ చేస్తుండగా.. ఈసారి ఎకరాకు 40 కిలోల ప్రకారం 5 ఎకరాల వరకు 200 కిలోలు ఇస్తుండటం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు జిల్లాలో 24,078 మంది రైతులు 32,737 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 8,024 మంది రైతులకు 11,250 క్వింటాళ్లు పంపిణీ చేయడం విశేషం.

- టీడీపీ హయాంలో సబ్సిడీ విత్తనాలు పొందాలంటే తలప్రాణం తోకకు వచ్చేది.
- మండల కేంద్రాలు లేదా నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లి వరుసలో నిల్చోవాల్సిన పరిస్థితి.
- వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం విత్తన పంపిణీలో సమూల మార్పులు చేసింది.
- జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లోనే విత్తన పంపిణీ చేస్తున్నారు.
- డి-క్రిషియాప్‌లో రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత నాన్ సబ్సిడీ చెల్లిస్తే అక్కడికక్కడే విత్తనాలు అందచేస్తారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో జేసీ మౌర్య

ఆలూరు: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. అర్జీలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం మండల స్థాయిలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 67 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య, డీపీఓ భాస్కర్ నాయుడు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, మెప్మా పీడీ నాగశివలీల, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, జేడీఏ వరలక్ష్మి, డీఈఓ రంగారెడ్డి, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం, కర్నూలు జిల్లాకు 8వ స్థానం లభించింది. గ్రామ, వార్డు వలంటీర్లు వ్య య ప్రయాసలకోర్చి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. కర్నూలు జిల్లాలో 2,47,021 పింఛన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా.. 2,45,023 పింఛన్లు పంపిణీ చేశారు. పంపిణీలో జిల్లాలోని దేవనకొండ మండలం మొదటిస్థానంలో నిలిచినట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు.

గ'ఘన' కీర్తి.. జ్ఞాన దీప్తి

- ఆకట్టుకున్న అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన
- ఉపగ్రహాలపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు
- హాజరైన వివిధ కాలేజీలు, స్కూళ్లకు చెందిన విద్యార్థులు



రాకెట్ నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం సాధించిన విజయాలను వివరిస్తూ ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)ల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను వివిధ కాలేజీలు, స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ముందుగా ఎగ్జిబిషన్‌ను అతిథులు ట్రిపుల్‌ఐటీడీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, షార్ డిప్యూటీ డైరెక్టర్ గ్రహదోరయ్, జనరల్ మేనేజర్ ఎస్.నరసింహామూర్తి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని కీర్తించాయన్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసేందుకు స్పేస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకుని నూతన ఆవిష్కరణలకు నాందిపలకాలన్నారు. ఈ ప్రదర్శనను జిల్లాలోని 15 కాలేజీలు, 52 స్కూళ్ళకు చెందిన 6,800 మంది విద్యార్థులు తిలకించారు. విద్యార్థులకు వకృత్వ, వ్యాస రచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. శని, ఆదివారాల్లో కూడా ప్రదర్శన కొనసాగనుంది. ప్రభుత్వ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు జి.పుల్లారెడ్డి కాలేజీ యాజమాన్యమే బస్సు సౌకర్యాన్ని కల్పించింది.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

వైజ్ఞానిక ప్రదర్శనలో శాటిలైట్ లాంచింగ్ విధానం, ఉపగ్రహం విడిపోవడం, రోదశిలోకి ప్రయాణించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. రాకెట్‌కు గుండెగా భావించే క్రయోజనిక్ వ్యవస్థ గురించి తెలియజేశారు. ఉపగ్రహాల ద్వారా వాతావరణంలో మార్పులను ఎలా తెలుసుకుంటారు.. సముద్రాలు, గ్రహాల స్థితిగతుల అధ్యయనం ఎలా చేస్తారో చెప్పారు.



స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు



అంతరిక్ష ప్రయోగాల గురించి వివరిస్తున్న దృశ్యం

చాలా ఆనందంగా ఉంది



అంతరిక్ష పరిశోధనల గురించి పుస్తకాల్లో చదువుకునే వాళ్లం. చంద్రయాన్-3 విజయవంతం తర్వాత రాకెట్లు ఎలా ఉంటాయే నేరుగా చూడాలని ఉండేది. స్పేస్ ఎగ్జిబిషన్‌లో నమూనా రాకెట్లు చూడటం చాలా ఆనందంగా ఉంది.

– ఓషియా భాను, 10వ తరగతి విద్యార్థి

ఎన్నో విషయాలు తెలుసుకున్నా



అంతరిక్షం, రాకెట్ల గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నా. ఎగ్జిబిషన్‌లో ఉపగ్రహాల పనితీరు గురించి చక్కగా వివరించారు. అంతరిక్ష పరిశోధనలు ఎలా చేస్తారో చెప్పారు. ఎగ్జిబిషన్ చాలా బాగుంది.

– శశి, 10వ తరగతి విద్యార్థి

అద్భుతంగా ఉంది



నమూనా రాకెట్లను చూపించారు. రాకెట్లతో ప్రయోగాలు ఎలా చేస్తారో చెప్పారు. ఎగ్జిబిషన్ అద్భుతంగా ఉంది. అంతరిక్ష పరిశోధనల గురించి చాలా తెలుసుకున్నాం.

– షాహిన్, 6వ తరగతి

చాలా నేర్చుకున్నా



సాధారణంగా అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని చూసేందుకు అనుమతించరు. అలాంటిది ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ఇస్రో, షార్‌ల నుంచి సైంటిస్టులు మా కాలేజీకి రావడం చాలా సంతోషంగా ఉంది. వివిధ అంశాలపై వారు మాకు అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్‌లో వలంటీర్‌గా ఉంటూ విద్యార్థులకు వివరిస్తూ చాలా నేర్చుకున్నా.

– బి.మమత, బీటెక్ విద్యార్థిని

అదృష్టంగా భావిస్తున్నా



మా కాలేజీలో అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నా. రాకెట్లు, ఉపగ్రహాల గురించి, వాటిలో వాడే పరికరాల గురించి తెలుసుకోవడం ఆనందంగా ఉంది. వలంటీర్‌గా ఉండి స్పేస్ ప్రయోగాల గురించి, అందులోని వివిధ మాడ్యుల్స్ గురించి స్కూల్ పిల్లలకు వివరిస్తున్నా.

– గుణశ్రీ, బీటెక్ విద్యార్థిని

నల్లమల అడవిలో పేకాట

• 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

మహానంది: నల్లమల అడవిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపి 13 మందిని అరెస్ట్ చేశారు. భారీ మొత్తంలో రూ. 6.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన పలువురు బసవాపురం సమీపంలోని నల్లమల అడవిలో పేకాట ఆడుతున్న పోలీసులకు సమాచారం వచ్చింది. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది మఫ్టీలో సుమారు మూడు కిలోమీటర్లు అడవిలోకి నడుచుకుంటూ వెళ్లారు. పేకాట స్థావరంపై దాడి చేసి ప్రొద్దుటూరుకు చెందిన జమాల్‌బాషా, చంద్రబాబు, చలపతి, సంజామలకు చెందిన రామచంద్రుడుతో పాటు మొత్తం 13 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో రూ. 6.60లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవీంద్ర స్టేషన్‌కు చేరుకుని విచారణ జరిపారు. 13మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

కర్నూలు నగరంలో..

కర్నూలు: హబీబ్ ముబారక్ నగర్‌లోని హంద్రీ నదిలో ముళ్ల పొదల చాటున పేకాట ఆడుతున్న రాజీవ్ గృహకల్పకు చెందిన ఎరుకల కల్యాణ్, బొల్లూరు సురేష్, బొల్లూరు సురేంద్ర, సురసుర సాయి, సురసుర లక్ష్మన్న, సురసుర వంశీని మూడో పట్టణ ఎస్ఐ వెంకటసురేష్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3,200 నగదు, పేకాట ముక్కలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడి చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.





నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల7న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే ప్రాంతాలను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.

మండలం	ఆరోగ్య శిబిరం
ఎమ్మిగనూరు	శివన్న నగర్ యుపీహెచ్‌సీ
ఎమ్మిగనూరు	కడిమెట్ల
వెల్దుర్తి	రామళ్లకోట
తుగ్గలి	రామపల్లి
పెద్దకడుబూరు	పెద్దకడుబూరు-1
పత్తికొండ	చిన్నహుల్తి
ఓర్వకల్లు	మీదివేముల
నందవరం	నాగులదిన్నె-1
మంత్రాలయం	సోగూరు
కర్నూలు	ముజఫర్‌నగర్‌యుపీహెచ్‌సీ
కర్నూలు	బసాపురం
క్రిష్ణగిరి	చెంచు ఎర్రగుడి
కౌతాళం	కామవరం
కోసిగి	పల్లిపాడు
కోడుమూరు	లద్దగిరి-2
కల్లూరు	తడకనపల్లి
హొళగుంద	చిన్నహేట
గోనెగండ్ల	గోనెగండ్ల-1
దేవనకొండ	చెల్లెలి చెలిమ
చిప్పగిరి	నేమకల్
సి.బెళగల్	ముడుమాల
ఆస్పరి	చిగిలి-2
ఆలూరు	మొలగవల్లి
ఆదోని	హానవలు
ఆదోని	హవనపేట యుపీహెచ్‌సీ

• కన్న ప్రేమకు చక్రాలు కట్టి!



పై చిత్రంలో స్ట్రెచ్చర్ తోసుకుంటూ వెళ్తున్న వారు గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన నాగమ్మ, మాదన్న దంపతులు. చెట్టంత కొడుకు పరమేష్ గత ఏప్రిల్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కాలికి గాయమైంది. అప్పుడు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స చేయించారు. ఇంకా పూర్తిస్థాయిలో నడవలేకపోతుండటంతో శుక్రవారం పెద్దాసుపత్రికి తీసుకొచ్చారు. ఓపీలో వైద్యులకు చూపించిన తర్వాత ఎక్స్‌రే తీయించేందుకు స్ట్రెచ్చర్ కోసం వెళ్లారు. ఎంతసేపటికీ బాయ్స్ రాకపోవడంతో వారే శుశ్రూతభవన్‌కు వెళ్లి స్ట్రెచ్చర్ తెచ్చుకుని కుమారుడికి ఎక్స్‌రే తీయించారు. వృద్ధాప్యంలో కన్న కుమారుని కోసం ఆ దంపతులు పడుతున్న కష్టం చూసి ప్రతి ఒక్కరూ చలించిపోయారు. – కర్నూలు(హాస్పిటల్)

జయహో భారత్

• హాకీలో విజయంపై సంబరాలు

కర్నూలు (టౌన్) : ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు స్వర్ణపతకం సాధించడంతో స్థానిక క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో క్రీడా సంఘాలు, ఒలింపిక్ సంఘం నాయకులు బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. తర్వాత ప్రాంగణంలో ఉన్న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జపాన్‌పై 5–1తేడాలో గెలుపొంది మన దేశం హాకీలో మరోసారి సత్తా చాటిందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు ఈ విజయం ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. వేడుకల్లో కర్నూలు హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, ప్రభుత్వ పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు క్రీడా సంఘాల ప్రతినిధులు నాగరత్నమయ్య, ప్రతాప్, త్రైక్వాండో వెంకటేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూల మాల వేస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు



అనాథ శరణాలయాల పరిశీలన

కర్నూలు(లీగల్): నగరంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం, శిశుగృహం, వేదాస్‌షెల్టర్ హోంలను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు సందర్శించారు. అక్కడి సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. హాలహర్వి మండలం బాపురం గ్రామం నుంచి చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సీడీపీఓ శాఖ సిబ్బంది తీసుకొచ్చిన పిల్లల గురించి తెలుసుకుని పునరావాసానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో పిల్లలు, వారి సౌకర్యాలు పరిశీలిస్తున్న జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

పశ్చిమ బెంగాల్ వాసి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: కోటపాడు శివారులో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈవిషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని సీదులి గ్రామానికి చెందిన పరదేశీ బుయా(48) రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో అదే రాష్ట్రానికి చెందిన అశోక్‌షా అనే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తుండేవాడు. సెప్టెంబర్ 30వ తేదీన స్వగ్రామానికి వెళ్లి ఈనెల 2వ తేదీన తిరిగి రామ్‌కో ఫ్యాక్టరీలోకి పనికి వచ్చాడు. అదే రోజు ఊరికి తిరిగి వెళ్తున్నట్లు చెప్పి బయటకు వచ్చాడు. కోటపాడు గ్రామ శివార్లలో ఏపుగా పెరిగిన కంపచెట్ల మధ్యలో ఆకుల తీగతో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో పశువులు మేతకు వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

9న ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): ఈనెల 9 వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డు కలిగి, ఫెన్సింగ్ కోచ్ నుంచి శిక్షణ సర్టిఫికెట్ లేదా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఉండాలన్నారు. ఆయా సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీతో పాటు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగతంగా ఫెన్సింగ్ ఎక్విప్ మెంట్ వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులుఈనెల 14 వ తేదీ తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించే 10వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ బాల బాలికల పోటీలు, అలాగే అక్కడే 7 వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల యూత్ అండర్ -23 విభాగం (పురుషులు, మహిళలు) ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్: 96763 52682 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



గొర్రెల మందపై చిరుత దాడి

వెలుగోడు: నల్లమల అటవీ సమీపంలో గొర్రెల మందపై శుక్రవారం చిరుత పులి దాడి చేసింది. పట్టణానికి చెందిన నాగేష్ నాయక్, మరికొందరు తమ గొర్రెలు, మేకలను అటవీ సమీపంలోని గాలేరు వాగు వద్ద నీలగిరి చెట్లలో మేపుకుంటున్నారు. ఆ సమయంలో చిరుత మందపై దాడి చేసింది. ఈ ఘటనలో మేకపిల్ల చనిపోయినట్లు బాధితుడు నాగేష్‌నాయక్ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుత పాదముద్రలు సేకరిస్తున్నారు. మేకల పెంపకంతో ఆధారపడి జీవనం సాగిస్తున్న తనను ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఆస్పరి మండలంలోని పుటుకలమర్రి గ్రామంలో అక్రమంగా మట్టి తరలించి వెంచర్‌లోని రోడ్లకు ఉపయోగిస్తున్నారనే సమాచారం అందడంతో శుక్రవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో మట్టి తరలించారో అంచనా వేసి వెంచర్ యజమాని రాఘవేంద్రరెడ్డికి నోటీసు జారీ చేస్తామన్నారు. తనిఖీలో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.



13 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): న్యాయస్థానాల్లో పిటిషన్లకు ఒక రూపాయి స్థానంలో రూ.20 స్టాంపు వేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని కర్నూలు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో రోజూ వందల సంఖ్యలో న్యాయవాదులు తమ క్లైంట్లదారుల తరపున పిటిషన్లు దాఖలు చేస్తారన్నారు. న్యాయవాద సంఘాల ఆమోదం లేకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. గడచిన రెండు రోజులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులు తాజాగా మరో వారం రోజుల పాటు తమ విధులకు హాజరు కాకుండా నిరసన వ్యక్తం చేయాలని తీర్మానం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయవాద సంఘాలతో చర్చించి పోరాటం ఉధృతం చేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీనియర్ న్యాయవాదులు వై.జయరాజు, మురళీమనోహర్, ఓంకార్, జె.శ్రీధర్ తదితరులు ప్రకటించారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జంపాల యోగానంద్ (కర్నూలు నియోజకవర్గం), బీఎల్ నారాయణ(ఎమ్మిగనూరు), నాగేశ్వరరావు(కర్నూలు), బి. సూర్యప్రకాష్(కర్నూలు), సుధ(ఆలూరు), ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ (మంత్రాలయం), ఉపేంద్రకుమార్(ఆదోని), మలేష్ నాయుడు(కోడుమూరు), కోటేశ్వరుడు యాదవ్(పత్తికొండ), కార్యదర్శులు నరసింహులు (ఎమ్మిగనూరు), రమాకాంత్ (ఆదోని), భగత్ (కర్నూలు), కాశమ్మ (ఆలూరు), రాఘవులు (కోడుమూరు), యువ మోర్చా అధ్యక్షులు కేశవరామ్ చౌదరి (కర్నూలు), ఓబీసీ మోర్చా మాలేకర్ శ్రీనివాస్(ఆదోని), మహిళా మోర్చా అధ్యక్షులు గొందిపర్ల మాలతి(కర్నూలు), ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాసులు(కర్నూలు), మైనార్టీ మోర్చా అధ్యక్షులు నూర్ వలీ ఖాన్ (కర్నూలు)లను ప్రకటించారు. వీరికి త్వరలో నియామక పత్రాలను అందించనున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.

22న వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(హాస్పిటల్): వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ఈ నెల 22న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖరప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని వీవీఎస్ ఫంక్షన్ హాలులో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని వీరశైవ లింగాయత్‌లలో టెన్త్, ఇంటర్‌లలో మెరిట్ విద్యార్థులకు, ఐఐటి, ట్రిబుల్ ఐటీ, నీట్, నెట్ పరీక్షలలో ప్రతిభ కనపరిచిన వారికి, మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థులకు, నూతనంగా ఉద్యోగం సాధించిన ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేటు సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి ఈ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. ఇటీవల కాలంలో రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులను కూడా సన్మానిస్తామన్నారు.